పాలకొల్లు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా మాధురి

ప్రజాశక్తి - పాలకొల్లు
పాలకొల్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ యర్రా మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించే విషయంలో పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు సూచించిన విధంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. ప్రజలు ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించాలని కోరారు. ఆమెకు వైద్యులు, సిబ్బంది స్వాగతం పలికారు.

చిరుద్యోగులకు పథకాలు కట్..!

ప్రభుత్వాలు మారినా చిరుద్యోగుల బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. అత్తెసరు జీతాలతో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారింది. నెలకు రూ.ఏడు వేలు, రూ.11 వేలు, రూ.13 వేలు జీతం తీసుకుంటున్న ఉద్యోగులకు సైతం ప్రభుత్వ పథకాలు ఇవ్వకుండా నిలుపుదల చేయడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏఒక్క ప్రభుత్వ పథకమూ చిరుద్యోగులకు దక్కకపోవడంతో ఆయా కుటుంబాలు పడుతున్న ఆర్థిక కష్టాలు వర్ణనాతీతం.

వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం తీరు

కాంట్రాక్ట్, స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు పూర్తిగా నిలిపివేత

రూ. ఏడు వేలు జీతం అందుకునే అంగన్‌వాడీ ఆయాలకు తల్లికి వందనం కట్

వైద్యమిత్రల వేతనం రూ.13 వేలు, వర్తించని ఏఒక్క పథకం

కుటుంబ సభ్యులకు పెన్షన్, పిల్లలకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో సహా అన్నీ నిలుపుదల

రేషన్ కార్డుల్లో వివాహమైన పిల్లల పేర్లు సైతం తొలగించని దుస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 6,500 మందికిపైగా అంగన్‌వాడీలు పని చేస్తున్నారు. వివిధ శాఖల్లో వేల సంఖ్యలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. అంగన్‌వాడీల జీతం రూ.11,500, ఆయాల జీతం రూ.ఏడు వేలు. వీరికి ప్రభుత్వం పథకాలను నిలిపివేసింది. గత ప్రభుత్వం అంగన్‌వాడీ ఆయాలకు అమ్మఒడి ఇవ్వగా, ఈ ప్రభుత్వం ఆయాలకు సైతం తల్లికి వందనం నిలిపివేసింది. వైద్యమిత్రల జీతం నెలకు రూ.15 వేలు. చేతికొచ్చేది రూ.13 వేలు మాత్రమే. పెరిగిన ఖర్చులతో పోలిస్తే వైద్యమిత్రలకు ఇచ్చే జీతం నెలవారీ ఖర్చులకు ఏమాత్రం చాలని పరిస్థితి. వైద్యమిత్రలకు సైతం ప్రభుత్వ పథకాలు గత ప్రభుత్వం నుంచి నిలిచిపోయాయి. వీరే కాదు. తక్కువ జీతాలకు పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. దీంతో ముఖ్యంగా పిల్లల చదువుల విషయంలో చిరుద్యోగులు తీవ్రంగా నలిగిపోతున్నారు. చిరుద్యోగుల రేషన్ కార్డుల్లో ఉన్న తల్లిదండ్రులకు 60 ఏళ్లు దాటినా పెన్షన్ రావడం లేదు. రేషన్‌కార్డుల్లో పేర్ల తొలగింపు వంటి ప్రక్రియ సైతం జరగడం లేదు. పిల్లలకు వివాహాలు అయిపోయాయని, వారి పేర్లను తమ కార్డుల్లో నుంచి తొలగిస్తే ప్రత్యేక కార్డు తీసుకుంటారని, ప్రయత్నిస్తే జరగడం లేదు. అదేమని అడిగితే ఆన్‌లైన్‌లో కావడం లేదని సచివాలయ ఉద్యోగులు సమాధానం ఇస్తున్నారు. దీంతో ఏం చేయాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. చిరుద్యోగుల గురించి ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతోమంది బడాబాబులు పెద్దపెద్ద వ్యాపారాలు చేస్తూ నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. అయినప్పటికీ వారికి తెల్లరేషన్‌కార్డుతోపాటు, ప్రభుత్వ పథకాలన్నీ ఇస్తున్నారు. గ్రామాల్లో భూస్వాములు అన్ని పథకాలనూ తీసుకుంటున్నారు. చిరుద్యోగులను మాత్రం ప్రభుత్వం తీవ్రంగా హింసిస్తోంది.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిగా నమోదు తీస్తేనే న్యాయం

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసింది. దీంతో రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం సచివాలయాలకు వెళితే ఎంప్లాయి అని వస్తుందని, సాధ్యం కాదని చెబుతున్నారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వేతనంలో ఒకటో వంతు కూడా చిరుద్యోగులకు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు అందే ఏఒక్క సదుపాయమూ వీరికి అందదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీరిని తొలగించి తమకు కావాల్సిన వారికి నాయకులు నియమించుకుంటుంటారు. అటువంటప్పుడు ప్రభుత్వ ఉద్యోగులుగా ఏవిధంగా చెబుతారో అర్థం కావడం లేదు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగి అనే తొలగిస్తే తప్ప చిరుద్యోగులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. దీనిపై అంగన్‌వాడీలు వారంరోజుల్లో తీవ్ర ఆందోళనలకు సైతం దిగుతున్న పరిస్థితి ఉంది.

నేడు, రేపు కొల్లేరులో సుప్రీం సాధికారిత కమిటీ

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి

కొల్లేరు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - కైకలూరు, మండవల్లి
కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందు ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలో సుప్రీంకోర్టు నియమించిన సాధికారిత కమిటీ పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం సాధికారిత కమిటీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా నిడమర్రు మండలం తోకలపల్లి, మండవల్లి మండలం మణుగూరు, పులపర్రు, కైకలూరు మండలం ఆటపాక, ఆలపాడు, కొల్లేటికోట ప్రాంతాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. ఆమెతోపాటు కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొల్లేరుకు సంబంధించి సుప్రీం సాధికారిత కమిటీ ఈ నెల 17, 18 తేదీల్లో కొల్లేరులోని కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. కొల్లేరులో ఎన్ని నివాసిత ప్రాంతాలు ఉన్నాయి, జిరాయితీ భూములు, డి.ఫారం పట్టా భూములు ఏమున్నాయి, 2006 సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఎలా అమలు చేశారనే అంశాలను కమిటీ పరిశీలించనుందన్నారు. పర్యటన అనంతరం బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లో కొల్లేరుకు సంబంధించిన వినతులను స్వీకరిస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలోని కొల్లేరువాసులు కూడా తమ సమస్యలను అందజేయవచ్చన్నారు. కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కమిటీ మంగళవారం కైకలూరు ప్రాంతంలోని ఆటపాక, కొల్లేటికోటలో, బుధవారం నిడమర్రు ప్రాంతంలో జిరాయితీ భూముల్లో, పర్యటిస్తుందన్నారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గ కొల్లేరువాసులు బుధవారం ఏలూరులో కమిటీకి వినతులు అందజేస్తారన్నారు. వారి వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఎఫ్‌ఒ (వైల్డ్ లైఫ్) బి.విజయ ఉన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం
విభిన్న ప్రతిభావంతులు సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.2.88 లక్షల విలువైన ల్యాప్‌ట్యాప్‌లను ఉచితంగా అర్హులైన విభిన్న ప్రతిభావంతులైన ఎనిమిది మంది ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ రెగ్యులర్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు విద్యా సాంకేతికతను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ద్వారా ల్యాప్‌టాప్‌లను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధుల సంక్షేమ సంఘాల సభ్యులు

వయో వృద్ధుల సంరక్షణకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - భీమవరం
రోజురోజుకీ వృద్ధులపై పెరిగిపోతున్న అఘాయిత్యాలు, బిడ్డల నుండి వేధింపులు ఆందోళన కల్గిస్తున్నాయని భీమవరం వృద్ధుల సంక్షేమ సంఘాల సభ్యులు అన్నారు. స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ చదలవాడ నాగరాణికి వృద్ధుల సంక్షేమ సంఘాల సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వృద్ధులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని, ఎంతోమంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొటికలపూడి చిట్టివెంకయ్య, భీమవరం సంఘ అధ్యక్షుడు నల్లం నాగేశ్వరరావు, అప్పీలేట్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోనం పాండు రంగారావు, మట్లపూడి సత్యనారాయణ, దిరిసాల సత్యనారాయణ, ఈశ్వరరావు, తాళ్లపూడి గాంధీ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం : కలెక్టర్ నాగరాణి

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - మొగల్తూరు
క్రమం తప్పకుండా యోగా చేయడంతో ఆరోగ్యంతోపాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని కెపిపాలెం బీచ్‌లో పాండురంగస్వామి ఆలయ సమీపంలో సోమవారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. యోగాతో మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఈ సందర్భంగా విప్ నాయకర్ బీచ్‌లో స్నానాలు చేస్తూ యువకులు మృతి చెందుతున్న అంశాన్ని కలెక్టర్, ఎస్‌పిలకు వివరించారు. స్పందించిన వారు తీరంలో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజయవాడకు చెందిన ఇంటర్నేషనల్ యోగ శిక్షకురాలు బి.శిరీష పలు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ మొగలి వెంకటేశ్వర్లు, ఎఎస్‌పి వి.భీమారావు, డిపిఒ ఎస్.రామనాథరెడ్డి, ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి శ్రీవేద, డిఎల్‌పిఒ జ్యోతిర్మయి, ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ ఎ.హరిశ్రీనివాస్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీరామ్, తహశీల్దార్ కె.రాజకిశోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సర్పంచులు అందే వెంకటలక్ష్మి, తిరుమాని విజయలక్ష్మి, పేరుపాలెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిపిఒ

డిపిఒగా రామ్‌నాథ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం
జిల్లా పంచాయతీ అధికారిగా ఎన్.రామ్‌నాథ్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పంచాయతీ అధికారిగా పని చేసిన అరుణశ్రీ బదిలీ అయ్యారు. కొత్త డిపిఒగా నియమితులైన రామ్‌నాథ్‌రెడ్డి స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ చదలవాడ నాగారాణిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను పరిశుభ్రంగా ఉంచేందుకు, ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ యూనిట్లను నూరుశాతం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భీమవరం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా రాంబాబు

భీమవరం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా ఎం.రాంబాబు నియమితులయ్యారు. ఆయన సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన భీమవరంలో ఇప్పటికే చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.



నీరు విడుదల చేస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్

కుళాయి చెరువులోకి నీరు విడుదల

ప్రజాశక్తి - నరసాపురం
పట్టణంలోని కుళాయి చెరువులోకి కాలువ ద్వారా నీటిని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ విడుదల చేశారు. చెరువులోకి నీళ్లు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా నీటి ప్రాజెక్టులపై దృష్టి సారించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, కోటిపల్లి సురేష్, తోట అరుణ పాల్గొన్నారు.

అన్నదానం కంటే విద్యాదానం గొప్పది

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

ప్రజాశక్తి - ఉండి
అన్నదానం కంటే విద్యాదానం చాలా గొప్పదని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. సోమవారం ఉండి మండలం కోలమూరు గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిందన్నారు. జెడ్‌పి హైస్కూళ్లలోకి దగ్గర్లోని పాఠశాలల విద్యార్థులను కలపడం వల్ల చాలా పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫలితంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందన్నారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల సుభాష్‌రాజు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్‌బాబు, స్థానికుల సహకారంతో మండుటెండలో క్యాంపెయిన్ చేసి 45 మంది విద్యార్థులకు సంఖ్య పెంచామన్నారు. తమ పాఠశాలలో కొత్తగా చేరిన ప్రతి విద్యార్థికీ తల్లికి వందనంతోపాటు తన వంతుగా రూ.ఐదు వేలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగిందని, శ్రీనివాస వర్మ చేతుల మీదుగా నగదు పంపిణీ చేశానని చెప్పారు. డిఇఒ రమణ మాట్లాడుతూ పాఠశాల మూతపడకుండా చేయడమే కాక, ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా రూపాంతరం చెందేలా కృషి చేసిన సుభాష్‌రాజును అభినందించారు. అనంతరం గ్రామంలో తాగునీరు ఫిల్టర్ చేయకుండా సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు మంత్రి శ్రీనివాస్ వర్మ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ తక్షణం సమస్య పరిష్కరించి ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు అయినంపూడి శ్రీదేవి, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

సుబ్బరాజుచెరువు ప్రాంతవాసులకు పట్టాలివ్వాలి

సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య

సచివాలయ అధికారికి హైకోర్టు నుంచి వచ్చిన పత్రాలు అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పాలకోడేరు
మోగల్లు సుబ్బరాజు చెరువు ప్రాంతవాసులకు ఇళ్ల పట్టాలు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య డిమాండ్ చేశారు. మోగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయ అధికారికి ఇటీవల హైకోర్టు నుంచి వచ్చిన పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అశ్రియ్య మాట్లాడుతూ సుబ్బరాజు చెరువు ప్రాంతంలో ఎన్నో ఏళ్ల నుంచి నివసిస్తున్న వారందరికీ తక్షణం ప్రత్యామ్నాయం చూపించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. అలాగే పంచాయతీ తీర్మానం చేసి సుబ్బరాజు చెరువు ప్రాంతవాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. తక్షణం సుబ్బరాజు చెరువు ప్రాంత వాసుల సమస్యల పరిష్కారానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వాసు, బాబి, బాధిత ప్రాంతవాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించాలని వినతి



పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - పోడూరు
పండిత విల్లూరు గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగు నీరందించాలని సిపిఎం మండల నాయకులు పిల్లి.ప్రసాద్, శాఖా కార్యదర్శి కాటూరి యాకోబు డిమాండ్ చేశారు. సోమవారం పండిత విల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ పంచాయతీ వారు ఇచ్చే తాగునీరు బురదగా ఉంటోందన్నారు. అవి తాగితే రోగాల బారినపడతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పండితవిల్లూరు ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేతా వెంకట నరసింహమూర్తి, మల్లుల కొండమ్మ, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా అగ్నిమాపక శాఖలో బదిలీలు

కె.శ్రీనివాసరావు

కెవి.మురళీ కొండబాబు

ప్రజాశక్తి - భీమవరం
జిల్లా అగ్నిమాపక శాఖలో బదిలీలు జరిగాయి. దీనిలో భాగంగా భీమవరం అగ్నిమాపక కేంద్రం జిల్లా సహాయ అగ్నిమాపక అధికారిగా కె.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న సిహెచ్.సూర్యప్రకాశరావు బదిలీపై వేరొక చోటికి వెళ్లారు. తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్ర అధికారిగా కెవి.మురళి కొండబాబు నియమితులయ్యారు. ఇక్కడ ఇప్పటి వరకూ పని చేసిన జివి.రామారావు బదిలీపై వేరేచోటకు వెళ్లారు. ఖాళీగా ఉన్న ఆకివీడు అగ్నిమాపక కేంద్ర అధికారిగా జి.వెంకటేశ్వరరావు నియమించినట్లు జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

జగన్‌కు అధికార దాహం : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు
లిక్కర్, ఇసుక, గనులు, విలువైన భూముల ద్వారా లక్షల కోట్లు గత పాలనలో జగన్ సొంత జేబులోకి వేసుకున్నాడని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మిగిలిన వనరులను దోచుకోవడానికి మళ్లీ అధికారంలోకి రావాలనే కోరిక తప్ప చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేని జగన్‌ను ప్రజలు ఎప్పటికీ క్షమించరని చెప్పారు. నియోజకవర్గంలో పేదల వైద్యం నిమిత్తం సిఎం సహాయ నిధిగా 92 మందికి గాను రూ.68 లక్షల చెక్కులను సోమవారం మంత్రి రామానాయుడు అందజేశారు. మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే మానవత్వంతో సిఎం సహాయ నిధిని పునరుద్ధరించారని చెప్పారు. కూటమి నేతలు బోనం నాని, యర్రంశెట్టి పద్మారావు, తులా రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

సూచించిన వంగడాలే వేయాలి

ప్రజాశక్తి - నరసాపురం
నరసాపురం సబ్ డివిజన్‌లోని నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు మండలాల్లోని రైతులు సార్వాలో మార్టేరు వరి పరిశోధనా స్థానం వారు సిఫార్సు చేసిన వరి వంగడాలను మాత్రమే సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడిఎ ఈదా అనిల్‌కుమారి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముంపును తట్టుకునే వరి రకాలైన ఎంటియు 1232, ఎంటియు 1100 రకాలు సాగు చేయాలన్నారు. చౌడును తట్టుకునే రకాలుగా ఎంసిఎం 100, మ్యా 1293 రకాలు సాగు చేసుకోవాలన్నారు. ఈనెల 20వ తేదీలోపు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులు తమ రైతు సేవా కేంద్రాలలో విధిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు.

పోలీసు పిజిఆర్‌ఎస్‌కు 15 ఫిర్యాదులు : ఎస్‌పి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్
స్థానిక జిల్లా ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో 15 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా ఎస్‌పి అద్నాన్‌నయీం అస్మీ అన్నారు. ఫిర్యాదుదారులతో ఆయన స్వయంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిఐ వి.పుల్లారావు, డిసిఆర్‌బి సిఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ అహ్మదున్నీషా, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార నిందితునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - వీరవాసరం
బాలికను బెదిరించి అత్యాచారం చేసి ఆమె గర్భవతికి కారణమైన వ్యక్తికి భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు వీరవాసరం ఎస్ఐ ఎం.రాజకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొణితివాడ గ్రామానికి చెందిన కండెల్లి రమేష్ ఇదే గ్రామానికి చెందిన బాధిత బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. 2020 జులై 12న బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ డి.దుర్గామల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు. అప్పటి డిఎస్‌పి కె.నాగశ్వరావు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం భీమవరం సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం.రాజకుమార్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో రమేష్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.బ్రహ్మయ్య వాదనలు వినిపించినట్టు కోర్టు కానిస్టేబుల్ పి.నానిబాబు తెలిపారు.

గ్రామాభివృద్ధికి కృషి

పంచాయతీ కార్యదర్శి సుంకర వెంకటేష్

చిట్ చాట్

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు బాధ్యతగా వ్యవహరిస్తున్నానని వేంపాడు పంచాయతీ కార్యదర్శి సుంకర వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పంచాయతీలో ప్రధానంగా తాగునీరు, డ్రెయినేజీ, అపారిశుధ్యం సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశ్న : పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది?

దాతల సహకారంతో వేగేశ్న రామకృష్ణంరాజు (అభిరుచి రామకృష్ణంరాజు) సుమారు రూ.3 లక్షల విలువైన స్వచ్ఛరథాన్ని బహూకరించారు. ప్రతి రోజు ఇంటింటా చెత్త సేకరణ చేస్తూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా అడుగులు వేస్తున్నాం.

ప్రశ్న : తాగునీటిపై కార్యచరణ ఏమిటి?

మైక్రో ఫిల్టర్ బెడ్స్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు దాతలు ముందుకొచ్చారు. త్వరలో దాతల సహకారంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో మైక్రో ఫిల్టర్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : గ్రామంలో ఆదాయ మార్గాలు పెంచుకునేలా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

రెవెన్యూ డిపార్ట్మెంట్ సహకారంతో గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఉన్న కొబ్బరి చెట్లకు మార్కింగ్ వేసి గుర్తిస్తున్నాం. త్వరలో వేలంపాట నిర్వహించి ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : కాలువలు, డ్రెయిన్లలో చెత్తాచెదారాలు వేయకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఫొటో కొట్టు గిఫ్ట్ పట్టు డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు ఆదేశాలను అనుసరించి ఎవరైనా చెత్త చెదారాలు వేస్తే జరిమానా విధించి చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.

బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - ఇరగవరం

ఉపాధి హామీకి బడ్జెట్లో రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరగవరం మండలం కంతేరు గ్రామంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ వలసలు నివారించేందుకు, పేదరిక నిర్మూలనకు తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం వచ్చిన తరువాత గ్రామీణ కూలీల కుటుంబాల్లో కొద్దో, గొప్పో కొనుగోలు శక్తి పెరిగి మనో ధైర్యాన్ని ఉపాధి హామీ కలిగించిందని తెలిపారు. గత మూడు నెలలుగా ఉపాధి కూలీలు పని చేస్తున్నప్పటికీ మొత్తం బకాయిలు చెల్లించకుండా మే 10వ తేదీ వరకు మాత్రమే నిధులు మంజూరు చేయడం సరికాదని విమర్శించారు. కష్టపడి పనిచేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మొత్తం బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో. గుత్తుల అప్పారావు, నూతంగి మణి, కాటూరి విజయలత, గుబ్బల రామకృష్ణ, అంపా వెంకటేశులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

నెలాఖరులోపు ధాన్యం సొమ్ము చెల్లింపు

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ఆచంట :ఈ నెలాఖరులోపు రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తామని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం పెనుమంచిలి, శేషమ్మ చెరువు గ్రామాల్లో పల్లె పల్లెకూ మన పితాని కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పితాని మాట్లాడుతూ ఈ ఏడాది పంట దిగుబడి అధికంగా ఉండడంతో కొంతమేర రైతులకు సొమ్ములు చెల్లింపులు జాప్యం జరిగిందని, నెలాఖరులోపు మిగిలిన రైతులకు సొమ్ములు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులతో సమీక్షించి తరువాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కూటమి రాకతో రాష్ట్రంలో రౌడీ పాలనకు స్వస్తి పలికి సంక్షేమ పాలన సాగిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంట కాలువల ప్రక్షాళన కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి వచ్చిన వినతి పత్రాలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు అందజేసి తల్లికి చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచి గణేశుల శేషవేణి, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసు, సిద్ధాంతం డిసి ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యాసామగ్రి అందజేత

భీమవరం :పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు అవసరమైన సామగ్రిని రూ.50 వేలతో జిరాక్స్ ప్రింటర్, బీరువా, 2025 పది ఫలితాల్లో మండలంలో ప్రథమ స్థానం సాధించిన ప్రవల్లికశ్రీకి రూ.5 వేలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహేష్‌బాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీ యమన్నారు. పూర్వ విద్యార్థులు మస్తాన్, సుబ్బారావు, కనకారావు, కోదండ రామరాజు, పి.వాసు, కె.కళ్యాణ్‌బాబు, జయరాం పాల్గొన్నారు.

బీచ్‌లో ఫ్లెక్సీల ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం, కెపి.పాలెంబీచ్ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఆదివారం ప్రజాశక్తిలో సాగర తీరం.. విషాద భరితం శీర్షికన వచ్చిన కథనంపై స్పందించిన పోలీసులు సోమవారం చర్యలు చేపట్టారు. పర్యాటకులకు బీచ్‌లో జరిగే ప్రమాదాలను వివరిస్తూ 12 ప్రదేశాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలం, పండిత విల్లూరు గ్రామానికి చెందిన యిందుకూరి సరస్వతి భర్త యిందుకూరి త్రిమూర్తి రాజు డోర్ నెంబర్ 1-9 నకు చెందిన, హైదరాబాద్ వారు 22-06-2017 న **M4354218** నెంబర్ గల ఒరిజినల్ పాస్పోర్ట్ జారీ చేశారు. అయితే ఆ పాస్పోర్ట్ డామేజ్ కావడంతో **R0156524** నెంబర్ గల పాస్పోర్ట్‌ను జారీ చేయగా 13 -06-2025 తేదీన మా ఇంటి నుంచి పాస్పోర్ట్ జిరాక్స్ నిమిత్తం మోటర్ సైకిల్ పై వెళుతుండగా పాస్పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యంలో పడిపోయింది. ఆ కవర్లో హైదరాబాదు వారి జారీ చేసిన **R0156524** ఒరిజినల్ పాస్పోర్టు కలిగి ఉంది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు సంప్రదించగలరు.

యిందుకూరు సరస్వతి
తండ్రి: త్రిమూర్తి రాజు
డోర్ నెంబర్ 1-9
పంచాయితీ రోడ్డు, పండిత విల్లూరు
పోడూరు మండలం,
ప॥గో॥జిల్లా, పిన్ - 534122
సెల్ నెం: 94404 80938

డయేరియాపై జాగ్రత్తలు తీసుకోవాలి

గణపవరం:ఐదేళ్లలోపు పిల్లలకు నీళ్ల విరేచనాలైతే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యం అందించాలని, వారి పట్ల 15 రోజులపాటు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. స్థానిక రెండో సచివాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన అతి విరేచనాల నిరోధక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డయేరియా నిరోధక కార్యక్రమం ఈ నెల 30వ తేదీ వరకూ జరుగుతుందని చెప్పారు. నీళ్ల విరేచనాలు నిలుపుదల చేయడానికి 15 రోజులపాటు ఒఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు అందించాలని చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు మాట్లాడారు. డాక్టర్ కె.ఓంకార్‌నాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి

పెనుమంట్ర:ప్రభుత్వం అందించిన విద్యా సామగ్రితో బాగా చదివి, విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని మండల మాజీ వైస్ ఎంపిపి కట్టా బాలాజీ వన కుమార్ అన్నారు. సోమవారం నెగ్గిపూడి (మార్టేరు)లో ఎస్‌విజి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యా కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ జాలిన్ చిన్న, టిడిపి మండల అధ్యక్షులు చిర్ల బాలాజీ రెడ్డి, సెక్రటరీ కట్టా వెంకటరమణ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.ఔ

జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలి

గణపవరం:మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ కె.ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మ ణరావు, డాక్టర్ శ్రీదివ్య మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకూ మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు అన్ని సచివాలయాల పరిధిలో జరుగుతాయన్నారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెర్బాక్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 'వెర్బాక్' సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పెద్దలు అన్నారు. కాళ్లలో వెర్బాక్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను సంస్థ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎంవివి.సత్యనారాయణ, గ్రామస్తులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ కాలనీకి వెళ్లాలంటే వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్నారని, తమ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు గాదిరాజు కిరణ్ కుమార్ వర్మ, నారిన శ్రీనివాసరావు, వర్రే శివ తెలపడంతో సంస్థ సిఎస్ఆర్ నిధులతో సుమారు 50 లైట్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఒక ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు చీకటితో ఇబ్బంది పడుతున్న ప్రజలు, పాదచారుల కోసం సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన సంస్థకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 'వెర్బాక్' సంస్థ బిజినెస్ ఆఫీసర్ డిఎం.రాజు, కిషోర్ నాయుడు, నారిన శ్రీనివాసరావు, బండారు నాని, సోమేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజల పక్షాన నిలబడుతోంది వైసిపి'

కాళ్ల:రాష్ట్ర ప్రజల పక్షాన వైసిపి నిలబడుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్‌రాజు తెలిపారు. పెదఅమిరం పార్టీ జిల్లా కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం ప్రజాకోర్టు ఛార్జ్‌షీట్ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ చంద్రబాబు ఎన్నిసార్లు ఎన్నికలకు వెళ్లినా ఒంటరిగా పోటీ చేయలేదన్నారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ మాట్లాడారు. నరసాపురం పార్లమెంటు పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, భీమవరం,పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా గవర్నర్‌గా పాపారావు నాయుడు

ప్రజాశక్తి - ఆకివీడు

లయన్స్ నిధులతో ఇక్కడ నైపుణ్య శిక్షణా సంస్థను ఏర్పాటు చేయొచ్చని లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్‌విఎస్ఎస్.పాపారావు నాయుడు ఆకివీడు సభ్యులకు సూచించారు. ఆదివారం రాత్రి స్థానిక లయన్స్ 'వి' కన్వెన్షన్ హాల్లో ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారం జరిగింది. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ అంతర్జాతీయ లైన్స్ అంబాసిడర్ ఆఫ్ గుడ్ విల్ అవార్డు ఎంవి.సూర్యనారాయణ రాజు నూతన సభ్యుల చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కాకర్ల రాజరాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో గవర్నర్ పాపారావు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా క్లబ్‌లో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కెవిఎం.చంద్రశేఖర్, ఎస్‌విజి.అనిల్‌కుమార్, కోశాధికారిగా పి.వంశీకృష్ణ, మరో పది మంది ప్రమాణం చేశారు. క్లబ్ ముగిసిన కార్యవర్గ కార్యదర్శి మహారాజ్ జ్యోతిరెడ్డి, కోశాధికారి ఎంవిఎస్.నాగమణి పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పాలకొల్లు :వృద్ధుల పట్ల దూషణ, నిర్లక్ష్యం, శారీరక మానసిక వేధింపులు అరికట్టి, వారికి భద్రత, శ్రేయస్సు కల్పించాలని తహశీల్దార్ వై.దుర్గా కిషోర్‌కు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం వినతిపత్రం సమర్పించారు. కరోనాకు ముందున్న విధంగా సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే రాయితీ పునరుద్ధరణ చేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు వంగా నరసింహారావు, మాఘం బాల కొండలరావు, అత్యం ఆదిశేషారావు, కొండ్రెడ్డి సూర్యనారాయణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆచార్యుల సేవలు ఎనలేనివి

నరసాపురం:నరసాపురం యూనిట్‌ను బలోపేతం చేయడంలో, పెన్షనర్లకు సహాయ, సహకారాలు అందించడంలో, సామాజిక కార్యక్రమాలు అమలు చేయడంలోనూ విఎస్ఎస్ ఆచార్యులు సేవలు మరువ లేనివని వక్తలు కొనియాడారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నరసాపురం యూనిట్ పూర్వపు కార్యదర్శి, జిల్లా బ్రాంచ్ ప్రస్తుత జాయింట్ సెక్రటరీ అయిన విఎస్ఎస్ ఆచార్యులు సంతాప సభ ఎం.మార్కండేయులు సోమవారం అధ్యక్షతన జరిగింది. గౌరవాధ్యక్షులు బి.ఆనందరాజు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా ముఖ్య అతిథులు జిల్లా బ్రాంచ్ అధ్యక్షులు బి.హరికుమార్, జిల్లా ప్రధాన సలహాదారు వికె.వీరారావు, నరసాపురం యూనిట్ కార్యవర్గ సభ్యులు ఆచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వక్తలు మాట్లాడారు. కార్యదర్శి ఆర్ఆర్‌కె.రాజు, ప్రధాన సలహాదారు కెఎస్‌వి.ప్రసాద్, గౌరవాధ్యక్షులు బి.ఆనందరాజు, ట్రెజరర్ వై.స్వామినాయుడు, కుటుంబసభ్యులు వి.రంగనాథ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం	పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190	సెల్: 83339 88814

19న విష్ణులో సామూహిక యోగా

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

యోగాంధ్ర కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి జిల్లాకూ ఒక థీమ్‌ను ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిలో భాగంగా ఈ నెల 19వ తేదీన భీమవరం విష్ణు కళాశాల ప్రాంగణంలో సుమారు 5 వేల మంది అథ్లెటిక్స్, స్పోర్ట్స్ పర్సన్స్, యువతతో యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్రస్థాయి సన్నద్ధత సామూహిక యోగా కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం విష్ణు కాలేజీ ప్రాంగణంలోని నాలుగు ప్రాంతాలను పరిశీలించి, ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కలెక్టర్ వెంట జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఎవి.అప్పారావు, జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ బాబూరాంబాబు ఉన్నారు.

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాల విజయానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్లో సోమవారం మున్సిపల్, మండల, సచివాలయ స్థాయిలో యోగాభ్యసన కార్యక్రమాల నిర్వహణ, యోగాభ్యాసకుల హాజరు వంటి అంశాలపై జిల్లాలోని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో జెసి గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో కొంతమంది ఎంపిడిఒలు విధుల పట్ల నిర్లక్ష్యం వహి స్తున్నారని, యోగా కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించినా, నిర్దేశించిన లక్ష్యాలు సాధించకపోయినా ఆయా అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణపవరం : మానసిక శారీరక ఆరోగ్యం కోసం యోగా ఉపయోగపడుతుందని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. సోమవారం కాలేజీలో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం విద్యార్థులు సిబ్బంది యోగా చేస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, సిహెచ్.చైతన్య, జి.వెంకటరమణ, వి.శారదాదేవి, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

తణుకు : ఈ నెల 21న విశాఖ పట్టణంలో నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. సోమవారం గాజువాక కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోడీ పాల్గొంటున్న ఈ యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్ఎ పిలుపునిచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

18న డిగ్రీలో డబుల్ మేజర్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఆకివీడు

డిగ్రీలో డబుల్ మేజర్ విధానంపై ఈ నెల 18న అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ పి.ప్రతాప్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ 2025-26గాను డిగ్రీ స్థాయిలో ఇప్పటివరకు నడుస్తున్న సింగిల్ మేజర్ విధానం స్థానంలో ప్రభుత్వం నూతనంగా డబుల్ మేజర్ విధానం ప్రకటించిందన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నూతనంగా ప్రకటించిన డబుల్ మేజర్ విధానంపై ఇంటర్ పాసై డిగ్రీలో చేరుతున్న అనేక మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సందేహాలను నివృత్తి చేసేందుకు ఈనెల 18న కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు 99597 53832 నంబరును సంప్రదించవచ్చని చెప్పారు.

వాసుకు టిబిఆర్ ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రతిష్టాత్మక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ వారి టిబిఆర్ ఐకాన్ 2025 అవార్డును ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ అధినేత మద్దాల వాసు అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వత్ పరిషత్తు దేవులపల్లి రామానుజరావు కళామందిర్‌లో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మధుకర్ స్వామి, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, సీనియర్ సూపర్డెంట్ ఆఫ్ హైకోర్టు అంజనీ కుమారి చేతులమీదుగా వాసు అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్, ప్రెసిడెంట్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, చింతపట్ల వెంకటాచారి, జ్యూరీ మెంబర్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ టివి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ జోన్ మీట్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్ గృహంలో సోమవారం క్లబ్ జోన్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశానికి జోన్ ఛైర్మన్ అప్పన బదరీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాబోయే రోజుల్లో వాసవీ క్లబ్ తరపున చేసే కార్యక్రమాలు, ఇటీవల నిర్వహించిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యఅతిథిగా తక్షణ గవర్నర్ వలివేటి ప్రసాద్ (కొవ్వూరు) పాల్గొని ప్రసంగించారు. రీజినల్ సెక్రటరీ రవి, సెక్రటరీ బాబ్జీ, ట్రెజరర్ కె.బాలకృష్ణ, మొగల్తూరు, తూర్పుతాళ్లు, అంతర్వేది క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పల్లెపల్లెకూ మన పితాని

పెనుమంట: ఈ నెల 17న మండలంలోని జుత్తిగ, పొలమూరు, వెలగలవారిపాలెం గ్రామాల్లో పల్లె పల్లెకూ మన పితాని కార్యక్రమం, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నట్లు టిడిపి కార్యవర్గం ప్రతినిధి బులి రామిరెడ్డి సోమవారం సాయంత్రం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మండల, గ్రామ అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. ఈ మేరకు జుత్తిగలో ఉదయం 9 నుంచి 11 గంట వరకూ పంచాయతీ వద్ద మండల స్థాయి అధికారుల బృందం, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనున్నారు. అనంతరం పొలమూరు గ్రామంలో 12:30 నిమిషాలకు సిపిఎం ఆఫీస్ దగ్గరలో 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. తదితర కార్యక్రమాల నిర్వహణ జరగనుంది.

పాస్‌పోర్ట్ పోయినది

జుత్తిగ రఘురామ చంద్రమూర్తి, తండ్రి: ప్రసాద్, డోర్ నెంబర్ 1-39, దొంగరావి పాలెం, ఖండవల్లి, పెరవలి మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా

నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి 15-06-2022న **V2888262** నెంబర్ పాస్పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తీసికొని ది 29-05-2025 న మా ఇంటి నుంచి పెరవలికు బస్‌లో జెరాక్స్ కాపీలు తీయించుటకు వెళ్ళగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెదికినా దొరకలేదు. కాబట్టి నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికిన నా పై అడ్రస్‌కు అందజేయగలరు.

సెల్ నెం: 99639 56363

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి
తాడేపల్లిగూడెం
E.P.No. 17/2024 in
O.S.No. 9/2010

Between:
Reddy and Reddy Imports and Exports
Rep by its Partnar G. Sri Rama Reddy ...D.H.R
And
Bobbili Ganga Raju ...J.D.R
J.D.R : Bobbili Ganga Raju, S/o. Peddayya, age: 55 Years, R\o Bavaipalem (V), Nidamarru Mandal, Eluru Dist, A.P.

పై నెంబరు దావాలో మీ పై D.H.R కోర్టులో పిటిషన్ వేసియున్నారు. పై నెంబరు దావాలోని నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా బొబ్బిలి గంగరాజు గారు Aviod చేసియున్నారనియు శ్రీ కోర్టు వారు **ది. 26-06-2025వ సం॥రం తేదీన** వాయిదా వేసియున్నారు. సదరు **ది. 26-06-2025వ సం॥రం తేదీన** కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల శ్రీ కోర్టు వారు చట్టప్రకారం మీ పరోక్షముగా తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొత్తపల్లి వీర వెంకట సత్యనారాయణ
తాడేపల్లిగూడెం — అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తేది:15-06-2025 — సెల్: 94401 43195

IN THE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISON) AT VIJAYAWADA
I.A. NO. 1445/2024 IN O.S. NO. 2002/2024

Between :
M/s N.S. Textiles, Rep by its Prop: A.Hemalatha W/o Siva Kumar, Chittinagar, Vijayawada-1. ..... Plaintiff / Petitioner
AND
R1) Sri Kanikicharla Hari Rama Venkata Hemanth S/o late Prasad : a/a 34 years, R/o D.No. 78-14-9, Karicharlavari veedi, Eastern Street, Eluru.
R2) Kanikicharla Likitha, D/o (late) Prasad, a/a 28 years, D.No. 78-14-9, Karicharla vari Veedhi, Eastern Street, Eluru.
.... Defendants / Respondents

పై నెంబరు గల పిటీషన్ యందు మీరు రెస్పాండెంట్స్ అయివున్నారు. రెస్పాండెంట్స్ అయిన 1) కనికిచర్ల హరిరామ వెంకట హేమంత్ 2) కనికిచర్ల లిఖిత యొక్క హాజరు నిమిత్తం వాయిదా : ది.1-7-2025వ తేదీన ఉన్నది. కావున సదరు ది.1-7-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేదీ : 1-7-2025
ఉదయం 10-30 గం.లకు.

ఎస్.మల్లేశ్వరరావు, అడ్వకేట్,
సెకండ్ ఫ్లోర్, ఫస్ట్ ఛాంబర్, ఎ.ఎస్.రామారావు హాల్,
గవర్నర్‌పేట, విజయవాడ- 520 002.
సెల్ : 99480 92949

IN THE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISON) AT VIJAYAWADA
O.S. NO. 2002/2024

Between :
M/s N.S. Textiles, Rep by its Prop: A.Hemalatha W/o Siva Kumar, Chittinagar, Vijayawada-1. ..... Plaintiff
AND
D1) Sri Kanikicharla Hari Rama Venkata Hemanth S/o late Prasad : a/a 34 years, R/o D.No. 78-14-9, Karicharlavari veedi, Eastern Street, Eluru.
D2) Kanikicharla Likitha, D/o (late) Prasad, a/a 28 years, D.No. 78-14-9, Karicharla vari Veedhi, Eastern Street, Eluru.
.... Defendants 1 & 2

పై నెంబరు గల దావాలో మీరు ప్రతివాదులై వున్నారు. ప్రతివాదులైన 1) కనికిచర్ల హరిరామ వెంకట హేమంత్ 2) కనికిచర్ల లిఖిత యొక్క హాజరు నిమిత్తం వాయిదా : ది.1-7-2025వ తేదీన ఉన్నది. కావున సదరు ది.1-7-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియపరచ డమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేదీ : 1-7-2025
ఉదయం 10-30 గం.లకు.

ఎస్.మల్లేశ్వరరావు, అడ్వకేట్,
సెకండ్ ఫ్లోర్, ఫస్ట్ ఛాంబర్, ఎ.ఎస్.రామారావు హాల్,
గవర్నర్‌పేట, విజయవాడ- 520 002.
సెల్ : 99480 92949

లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

ముఖ్యమంత్రి సహాయనిధితో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని మాజీ శాసనమండలి ఛైర్మన్, రాష్ట్ర అడ్వయిజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మైనార్టీ అఫైర్స్) సభ్యులు ఎం.ఎ.షరీఫ్ అన్నారు. సోమవారం పట్టణానికి చెందిన మహ్మద్ సయ్యద్ అహ్మద్‌కు మంజూరైన రూ.7 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి అందించారు. ఈ సందర్భంగా షరీఫ్, రామరాజు మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, టిడిపి నాయకురాలు షేక్ యూనిస్ బేగం, మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలాలి ఖాన్ పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, గూటాల గ్రామం మరియు శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, పోలవరం గ్రామం, పోలవరం మండలం, ఏలూరు జిల్లా
భూముల సేద్యమునకు కౌలు హక్కునకు బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు మరియు పోలవరం మండలం, పోలవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, సంపూర్ణ హక్కు భుక్తములో గల ఈదిగువ నుదహరించిన భూములను 2025-2026 నుండి 2027-2028 సంవత్సరమువరకు అనగా 3 సంవత్సరముల కాలమునకు కౌలుకు సేద్యము చేసుకొను హక్కునకు దేవదాయ ధర్మదాయ శాఖ చట్టం 30/1987 జి.ఓ.ఎం.ఎస్.నెం.3973వెన్యూ (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ. 11.03.2001 మరియు జి.ఓ.ఎం.ఎస్.నెం.425 (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ.09.11.2015 ప్రకారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో యీ దిగువ తెలిపిన తేదీలలో బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు ఈక్రింది షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము..

I శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, పోలవరం గ్రామం.

వ. నెం.	భూమి యున్న గ్రామం, మరియు మండలం	సర్వే నెం.	విస్తీర్ణం యు.సెం.	ధరావత్తు	బహిరంగవేలం జరుపు ప్రదేశం, తేదీ మరియు సమయము
1.	పెద్దేవం గ్రామం తాళ్ళపూడి మండలం	143/1	1.42	రూ.10,000	పెద్దేవం శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద ది.28.06.2025 ఉదయం గం.10.00 లకు

II శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, గూటాల గ్రామం

వ. నెం.	భూమి యువ్వ గ్రామం, మరియు మండలం	సర్వే నెం.	విస్తీర్ణం యు.సెం.	ధరావత్తు	బహిరంగవేలం జరుపు ప్రదేశం, తేదీ మరియు సమయము
1.	పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం	168	5.10	రూ.10,000	కొయ్యలగూడెం శ్రీ మదన గోపాల స్వామి వారి దేవస్థానం వద్ద ది.28.06.2025 మధ్యాహ్నం గం 3.00 లకు

వేలంపాట షరతులు :
1. ఈ వేలం పాట సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి నిర్వహించబడుచున్నది.
2. దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు వున్నవారుగానీ, దేవస్థానముతో ఎట్టి లావాదేవీలు వున్నవారుగానీ పాటలో పాల్గొనరాదు. పాట పాడుటకు తగిన అర్హత లేనివారిని పాటలో పాల్గొనకుండా చేయుటకు కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు.
3. అంగీకరింపబడిన పాటదారు పాటకొట్టివేసిన వెంటనే ఒక సం.రం శిస్తుసొమ్ము చెల్లించు నిర్ణయం.
4. ఇతర వివరములకు శ్రీ స్వామి వారి దేవస్థానం కార్యాలయము పనివేళలలో సంప్రదించవలెను.

ది.16.06.2025, గూటాల — కార్యనిర్వాహణాధికారి, సెల్ నెం. 99486 11144

పాలకొల్లులో తేలికపాటి వర్షం

పాలకొల్లు :పాలకొల్లులో సోమవారం సాయంత్రం తేలికపాటి వర్షం పడింది. ఈదురుగాలులతో వర్షం పడడంతో పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్కూల్స్, కళాశాలలు విడిచి పెట్టడం, ఉద్యోగులు ఇంటికి వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్ నిలిచిపోంది. దీంతో ప్రజలు తడిసి ముద్దయ్యారు.

పబ్లిక్ ప్రకటన

యిందుమూలముగా ప్రజలకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, సోమవరప్పాడు గ్రామ పంచాయితీ వీరభద్రపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానమును మరియు వాటి స్థిర చరాస్తులను హిందూ దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలోనికి చేర్చి ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ మరియు హిందు రిలిజియన్ ఇనిస్టిట్యూషన్స్ మరియు ఎండోమెంట్స్ చట్టం 1987 (చట్టం నెం. 30/1987) నందలి సెక్షన్ 6 ప్రకారం పబ్లికేషన్ మరియు సెక్షన్ 43 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుటకు గాను ఆలయ కమిటీ మరియు అర్చకులు కోరిన మేరకు నిర్ణయించుట జరిగినది. కావున యిందు విషయమై ఎవ్వరికైన, ఏమైన అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నయెడల ఈ ప్రకటన ఇచ్చిన తేది నుండి పది(10) రోజుల లోపుగా లిఖిత పూర్వకంగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ ఆఫీసర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఏలూరు వారికి అందజేయగలరు

గ్రామం: వీరభద్రపురం
తేది: 16-06-2025

తనిఖీదారు
దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఏలూరు, ఏలూరు జిల్లా

BEFORE THE HON`BLE DEPTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT ELURU, ELURU DIST
A.A.C.F.No. 101/2024

Between:
Margadarsi Chit Fund (P) Limited, Eluru Br
.....Petitioner/Disputant
And
Yellapu Bhanu Chandra And Others
.....Respondents/Opponents
Op2: Mamuduri Mahankali, S/o. M. Anandam, Hindu, Male, a/a 52 Years, Occ : Employee, W/as Junior Assistant, % Assistant Commissioner of State Tax, Commerical Tax Office, N.R.Pet, Eluru, R/o D.No. 13-34, Behind Boys Convent, Xavier Nagar, Eluru, Eluru Dist.
Op3: Padilam Srinivasa Rao, S/o P. Rama Chandram, Male, a/a 49 Years. Occ : Business, Mg. Partner: M/s Balaji Consulting and Engineers, Shobha Complex, N.R.Pet, Eluru, R/o D.No. 25-11-33, Sinivasa Nilayam, Beside Allanani House, N.R. Pet, Eluru, Eluru Dist.

పై నెంబరు దావాలో వాదికి రావలసిన బాకీ రాబట్టుకునేందుకు గాను, మీ పై దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీరు అపోనెంట్స్ అయి ఉన్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.24-06-2025 న తేదికి** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఫోర్ మెన్/బ్రాంచ్ మేనేజర్
డిస్ప్యూటెంట్ కంపెనీ, ఏలూరు, ఏలూరు జిల్లా

BEFORE THE HON`BLE DEPTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT ELURU, ELURU DIST
A.A.C.F.No. 102/2024

Between:
Margadarsi Chit Fund (P) Limited, Eluru Br
.....Petitioner/Disputant
And
Mohammed Akhil Rehman And Others
.....Respondents/Opponents
Op3: Sunkara Mohana Krishna, S/o. S. Venkateswarlu, Hindu, Male, a/a 30 Years, Prop : M/s Sri Lakshmi Vinayaka Rice Stores, Santha Market street, Chebrolu, Unguturu (M), Eluru Dist., R/o D.No. 5-28, Near IBM Church, Chenchula Colony, Venkatapuram, Eluru (M), Eluru Dist.,
Op6: Kaki Krishna Rao, S/o K. Rama Krishna, Hindu, Male, a/a 33 Years. Occupation : Sanitary Works and Business, Adavikolanu Vari Street, Powerpet, Eluru, R/o D.No. 22b-1-23/1, Adavikolanu Vari Street, Beside: Reliance Petrol Bunk, Power pet, Eluru, Eluru Dist.

పై నెంబరు దావాలో వాదికి రావలసిన బాకీ రాబట్టుకునేందుకు గాను, మీ పై దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీరు అపోనెంట్స్ అయి ఉన్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.24-06-2025 న తేదికి** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఫోర్ మెన్/బ్రాంచ్ మేనేజర్
డిస్ప్యూటెంట్ కంపెనీ, ఏలూరు, ఏలూరు జిల్లా

BEFORE THE HON`BLE DEPTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT ELURU, ELURU DIST
A.A.C.F.No. 28/2024

Between:
Margadarsi Chit Fund (P) Limited, Eluru Br
.....Petitioner/Disputant
And
M/S Padma Agencies And Others
.....Respondents/Opponents
Op1: M/S Padma Agencies Rep By Prop: MR.CH. Indra Kumar, occupation: Business, D.No. 22c-15-4, Station road, power pet, Eluru, W.G. Dist.,
Op4: Chitturi Vara Lakshmi, W/o CH. Indra Kumar, Hindu, Female, a/a 51 Years. Occupation : Business, Prop: M/S Alankrit Boutique, F.No. 107, Sri Sai Gayatri Towers, Opp: Deloitte, Nanakramaguda, Hyderabad, R/o Flat No. 403, Block - A3, Trendset Winz Apartment, Near: Wipro circle, Nanakramguda, Hyderabad
Op5: Chitturi Venkata Lakshmi, W/o CH. Surya Rao, Hindu, Female, a/a 76 Years. Occupation : Profession, Agriculture & Palm Oil Gardens, Garlamadugu, Pedavegi (M), & Dea, W.G.Dist, R/o Flat. No. 403, Block - A3, Trendset Winz Apartment, Near: Wipro circle, Nanakramguda, Hyderabad

పై నెంబరు దావాలో వాదికి రావలసిన బాకీ రాబట్టుకునేందుకు గాను, మీ పై దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీరు అపోనెంట్స్ అయి ఉన్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.24-06-2025 న తేదికి** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఫోర్ మెన్/బ్రాంచ్ మేనేజర్
డిస్ప్యూటెంట్ కంపెనీ, ఏలూరు, ఏలూరు జిల్లా